ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 2 జూన్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 30.0

కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సారథి

లోపలి పేజీలో..





5కే వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని

డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే మహాభాగ్యం

ఏలూరులో 5కే వాక్‌థాన్

ఏలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ నిన దిస్తూ నగరంలో సాగిన 5కే వాక్‌థాన్ అంద రిని ఆలోచింప చేసింది. నషాముక్త్ భారత్ అభియాన్, అంతరాష్ట్రీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేకంగా వట్లూర్ సర్ సీఆర్‌ఆర్ మహిళా కళాశాల నుంచి ఇండోర్ స్టేడియం వరకు ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. విభిన్న ప్రతిభా వంతులశాఖ, పోలీస్, ఎక్సైజ్, ఈగిల్‌టీమ్, వైద్య ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి 26వ తేదీ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియో గ నివారణ దినోత్సవం వరకు డ్రగ్స్‌పై కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచార కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల కు సంబంధించిన సమాచారాన్ని 1972, 14446 టోల్‌ఫ్రీ నంబర్లకు అందించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ నిర్వహించారు.

కాగా వాక్‌థాన్ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనపరిచిన ఐదుగురు పురుషులకు, ఐదుగురు మహిళలకు కలెక్టర్ మెడల్స్ బహూకరించారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, డీఎస్‌వో శివ రా మ్మూర్తి, డీఎస్‌డీవో శ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రామ్‌కుమార్, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఏఆర్ డీఎస్పీ శేఖర్, డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండురంగారావు, డీసీపీవో డాక్టర్ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

సొసైటీ గొడౌన్లు.. అక్కరకు వచ్చేలా!



లక్ష్మీపురం గొడౌన్ (ఫైల్)

వైసీపీ ప్రభుత్వం హయాంలో అనాలోచితంగా నిర్మించిన సొసైటీల గొడౌన్లను గాడిలో పెట్టేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. సొసైటీలను అప్పుల ఊబిలోకి నెట్టి నిర్మించిన గొడౌన్లను వినియోగం లోకి తేవడానికి జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- ధాన్యం సేకరణ కేంద్రాలుగా వినియోగించే యోచన
- వేర్‌హౌసింగ్ వినియోగానికి కార్యాచరణ
- పౌర సరఫరాలు, సహకారశాఖ అధికారులకు సూచనలు

గత వైసీపీ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి నాయకులకు లబ్ధి చేకూర్చేలా 2022 నుంచి 2024 మధ్య కాలంలో జిల్లాకు 500, 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గొడౌన్‌లను మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యం లో 43 గొడౌన్లు చేపట్టింది. ఇందులో కేవలం 32 గొడౌ న్లు పూర్తి కాగా చాలావరకు నిరుపయో గంగా ఉన్నాయి. గతనెలలో 'గుదిబండలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జేసీ ధాత్రిరెడ్డి ఇటీవల ఆరా తీశారు. వాటిని పౌర సరఫరాల శాఖకు అనువుగా ధాన్యం సేకరణ, ఇతర నిల్వలు ఉంచుకునేందుకు వీలుగా సాధ్యాసాధ్యాలను ఆరా తీయాలని సూచనలు చేశారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ, మార్కె టింగ్, ఇతర శాఖల అధికారులు పరిశీలన చేస్తున్నారు. గొడౌన్ల నిర్మాణాలకు సొసైటీలు ఇప్పటికీ రుణాలను నాబార్డుకు చెల్లించాల్సి వస్తోంది.

వేర్ హౌసింగ్ వినియోగించుకునేలా..

మరోవైపు వీటిని పౌర సరఫరాలు, వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌తో పాటు పలు సంస్థలు సద్వినియోగిచుకునేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలో గొడౌన్లను వినియోగంలోకి తేవడానికి క్షేత్రస్థాయిలో సొసైటీల నుంచి దర ఖాస్తులను చేయించే బాధ్యతలను డీసీవోకు అప్పగించారు. సొసైటీ గొడౌన్లను వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇచ్చేందుకు వీలుగా సొసైటీలు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించాలి. ఇం దులో రైతుల పంటలను నిల్వ చేసుకున్నం దు కు బ్యాంక్ గ్యారంటీగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు సెక్యూరిటీ డిపాజిట్లను సొసైటీలకు (మిగతా 8వ పేజీలో)



నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అధికారులు

కాలువలకు సాగునీరు విడుదల

నిడదవోలు/రాజమహేంద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ అనంతరం మూసివే సిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం సాగు నీటిని విడుదల చేశారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న హెడ్ స్లూయిజ్‌కు ఆదివారం గోదావరి హెడ్ వర్క్స్ ఇన్‌చార్జి ఎస్‌ఈ వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పువ్వులు, చీర, రవిక, పండ్లు సమర్పించి హారతులిచ్చి హెడ్ స్లూయిజ్ స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ముందుగా 200 క్యూసె క్కుల నీటిని విడుదల చేసి అనంతరం సాయంత్రా నికి మరో 300 క్యూసెక్కులకు పెంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ కృష్ణంరాజు మాట్లాడుతూ రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలకు నీరంది స్తామన్నారు. ఇప్పటికే కాలువలకు సంబంధించి పూడికతీత పనులు పూర్తయ్యాయ న్నారు. కార్యక్రమం లో నీటి పారుదల శాఖ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఖరీఫ్‌లో తూర్పు డెల్టాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని సక్రమంగా అందించ నున్నామని తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నారు. రబీ సీజన్ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం సాగునీటిని విడుదల చేశారు. ధవళేశ్వరంలోని తూర్పుడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద సర్కిల్ ఇన్‌చార్జి ఎస్‌ఈ బత్తుల వెంకటస్వామి, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఈఈ వీవీ రామకృష్ణ గోదావరి మాతకు పూజలు నిర్వహించి అనంతరం గేట్లకు స్విచ్ ఆన్‌చేసి హెడ్ స్లూయిజ్ లోని నాలుగు గేట్ల ద్వారా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఈ బత్తుల వెంకట స్వామి, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్.. బొబ్బర్లంకలోని సెంట్ర ల్ డెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరమ్మకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు.



కాలువలకు విడుదలవుతున్న సాగునీరు

నేటి నుంచి యోగా పోటీలు : కలెక్టర్

ఏలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : యోగా ద్వారా ఐక్యత- వారధి పేరిట ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు మండల స్థాయిలో యోగా పోటీలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. సోమవారం జూనియర్ విభాగంలో సోలో యోగాసనాలు, సూర్య నమస్కారం, ప్రాణమాయం, మెడి టేషన్‌లో, 3న యువజన విభాగంలో 4న జూనియర్ యంగ్, సీనియర్ విభా గాల్లో, 6న జూనియర్ యంగ్, సీనియర్ విభాగాల్లో క్విజ్ పోస్టర్, స్లోగన్, వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు.

యోగా రిజిస్ట్రేషన్ వేగవంతం : జేసీ

జిల్లాలో యోగాభ్యాసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం సాయం త్రం వరకు 6లక్షల59వేల725 మంది రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 8.30 లక్షల మంది భాగస్వామ్యం చేయాలని లక్ష్యం నిర్ణయించామన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో చేపట్టిన చెరువు గండి పూడ్చివేత పనులు

పెద్ద చెరువు గండి పూడ్చివేత ప్రారంభం

నూజివీడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు నూజివీడు పెద్ద చెరువు గండి పూడ్చివేతకు అధికారులు శ్రీకారం చుట్టారు. పెద్ద చెరువు గండి పడి ఎనిమిది నెలలైనా ఇంత వరకు పూడ్చలేదని 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనా లు వచ్చాయి. ఈ క్రమంలోనే 'గండి మర్మమేమిటో' శీర్షికన శనివారం కథనం వచ్చింది. వర్షాలు ప్రారంభం కావడం, చెరువులో వచ్చిన వర్షపునీరు గండి ద్వారా బయటకు వెళ్లిపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని ప్రస్తావిం చడం జరిగింది. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికారులతో మాట్లాడి వెంటనే తాత్కాలికంగా గండిని పూడ్చివే యమని ఆదేశాలు ఇవ్వడంతో ఇరిగేషన్ అధికారులు ఆదివారం నుంచి పూడ్చివేత పనులను ప్రారంభించారు. ఈ గండి పూడ్చివేతకు అధికారులు రూ.రెండు కోట్ల 50 లక్షలతో ప్రతిపాదనలను పంపగా అవి రాష్ట్ర రెవెన్యూ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

ఎర్రకాలువ జలాశయం అభివృద్ధికి కృషి చేస్తా..

- ఎమ్మెల్యే రోషన్‌కుమార్..మరమ్మతు పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం,జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్ర కాలువ జలా శయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఆదివారం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం నాలుగు గేట్లు మరమ్మతుల నిమిత్తం చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రాజెక్టులు మరమ్మతులకు నోచు కుంటున్నాయన్నారు. డీఈ కె.సునీత శ్రీ లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిషోర్, నాయకులు పరిమి సత్తిపండు, ఎర్రకాలువ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు వందనపు రమణ, ఎంపీటీసీ రాంబాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.



జలాశయం గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

ఆప్షన్ -3 ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

అధికారుల సమీక్షలో మంత్రి కొలుసు

ఏలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 15వ తేదీలోగా ఆప్షన్ -3 కింద ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను అధికారులు చేరుకుని తీరాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. మంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం రాత్రి జిల్లా గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఆప్షన్ త్రీ కింద 18,849 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,225 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. సమావేశం హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖలో ఇద్దరు అధికారుల బదిలీ

- విద్యాశాఖ ఏడీగా వెంకటప్పయ్య
- ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా జయలక్ష్మి

ఏలూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో కీలకమైన విభాగాల్లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా ఎం.వెంకటప్పయ్య బదిలీపై ఆదివారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో సార్వత్రిక విద్యా పీఠం(అపోస్)జిల్లా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తూ బదిలీపై జిల్లాకు నియమితులయ్యా రు. విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా 1991లో ఉద్యోగప్రవేశం చేసిన ఈయన పదోన్నతిపై సూపరింటెండెంట్‌గా, ఏడీగా పలు జిల్లాల్లో పనిచేస్తూ, కొంతకాలం పల్నాడుజిల్లా ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఏడీ-2గా జిల్లా లో మూడేళ్లపాటు పనిచేసిన షరీఫ్ బదిలీ పై కాకినాడ డీఈవో కార్యాలయంలో నియ మితులయ్యారు.

ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా జయలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం గొల్లపూడిలో ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న ఈమెను బదిలీపై జిల్లాకు నియమించారు. ఇప్పటివరకు అసి స్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీకాంత్‌ను కడపజిల్లా ఏసీగా బదిలీ చేశారు. ఈయన ఆదివారం జిల్లాలో రిలీవ్ అయ్యారని డీఈవో కార్యాలయవర్గాలు తెలిపాయి. కొత్తగా నియమితులైన జయలక్ష్మి సోమ వారం బాధ్యతలు చేపడతారు. కాగా ప్రస్తు తం జరుగుతున్న పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రక్రియ కీలకమైనందువల్ల, పరీక్షల కార్య కలాపాలు మొత్తం ముగిసేవరకు మరో రెండునెలలపాటు పర్యవేక్షణ నిమిత్తం శ్రీకాంత్ జిల్లాలోనే ఉండే అవకాశం ఉంది.



తంగెళ్లమూడిలో రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

చౌక దుకాణాలకు చలో..

అట్టహాసంగా రేషన్ డిపోల్లో సరుకుల అందజేత ప్రారంభం

ఏలూరు సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ పాత రేషన్ వ్యవస్థ ప్రారంభమైంది. రేషన్ డిపోల ద్వారా సరుకులు తీసుకునే ప్రక్రియ ఆదివారం ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ప్రారంభిం చారు. జిల్లాలో అట్టహాసంగా 1,123 చౌకడిపోలు రేషన్ పంపిణీ చేయడానికి ప్రారంభించబడ్డాయి. గతనెల వరకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రక్రియ నిర్వహించగా జూన్ నెల రేషన్ పంపిణీ రేషన్ షాపుల వద్దే ప్రారంభించారు. పంపిణీ పారదర్శకంగా ఉండాలంటే రేషన్ డిపోల వద్దే పంపిణీ జరగాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీ విధానంలో మార్పులు చేసింది. ఎండీయూ ఆపరేటర్ల విధానాన్ని రద్దు చేసి ఇక నుంచి రేషన్ డిపోల వద్దే రేషన్ తీసుకునేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 6,20,146 బియ్యం కార్డులున్నాయి. తొలి రోజు ఆదివారం ప్రారంభిం చిన రేషన్ పంపిణీ కార్యక్ర మంలో రాత్రి 7గంటల నాటికి అందిన సమా చారం ప్రకారం జిల్లాలో 7.7శాతం పంపిణీ పూర్తయింది.

ఖచ్చితమైన తూకం ఉండాలి : కలెక్టర్

ఏలూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఖచ్చితమైన తూకం, నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి రేషన్ డీలర్లకు సూచిం చారు. నగరంలోని తంగెళ్లమూడిలో భ్రమరాంబకు చెందిన 126 నంబర్, కర్రి మంగకు చెందిన 127 రేషన్ షాపుల్లో ప్రజలకు ప్రారంభించిన రేషన్ పంపిణీని అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1123 రేషన్ దుకాణాల ద్వారా 6లక్షల20వేల146 కార్డుదారులకు రేషన్ పంపిణీ జరుగుతుం దన్నారు. 65 సంవత్సరాల పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులను డీలర్లు వచ్చి ఈ నెల 5వ తేదీలోగా అందిస్తారన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, తహసీల్దార్ శేషగిరిరావు, డీటీ రమేష్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజులపాటి గంగాధరరావు పాల్గొన్నారు. కాగా భీమడోలు, చేబ్రోలులో జేసీ ధాత్రిరెడ్డి రేషన్ డిపోలను పరిశీలించారు.

మ్యారేజ్ సర్టిఫికెట్ ఇవ్వట్లే!



- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న నూతన దంపతులు
- పట్టించుకోని ఉద్యోగులు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్న వైనం
- ఇదే అదనుగా కొందరు పెద్ద మొత్తంలో వసూలు

ఏలూరు రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి) : దంపతులు ప్రభుత్వ సంక్షేమ పథ కాలు పొందేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పసరి. పెళ్లి చేసుకున్న 21 రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ పొందాలన్న నిబంధనను వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. గ్రామ సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ పొందేలా రూపకల్పన చేసింది. అయితే సచివా లయ ఉద్యోగులు సర్టిఫికెట్ కోసం తిప్పుతుండడంతో చేసేది లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వస్తోంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాకా ఈ నిబంధ నల్లో మార్పులు చేసింది. పెళ్లయిన 60 రోజుల్లోపు సమీప సచివాలయాల్లో మ్యారేజీ సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. అయినా సచివాలయ సిబ్బంది కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం కల్యాణమస్తు పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి పదో తరగతి చదువుకున్న వారికి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నర వరకు అందిస్తోంది. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ జారీలో జాప్యంతో తప్పనిసరి పరిస్థితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయి స్తున్నారు. ఇదే అదనుగా అక్కడ డాక్యుమెంట్ రైటర్ రూ.2000 నుంచి రూ.3 వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. పెళ్లి కార్డు, పెళ్లి ఫొటోలు, చదువు లేక పోయినా అన్ని తాము చూసుకుంటామని చెప్పి, ముక్కు పిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి గ్రామ, వార్డు సచివాలయాల్లో త్వరితగతిన మ్యారేజీ సర్టిఫికెట్లు అందించేలా చర్య లు తీసుకోవాలని వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు ఇవి..

వధూవరులు ఎక్కడ పెళ్లి చేసుకుంటే అక్కడి గ్రామ సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రెండు ఫొటోలు, వధువు మెడలో వరుడు తాళి కట్టిన ఫొటో, పెళ్లికార్డు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు సమర్పించాలి. ఇరువురి పెద్దలు సచివాలయంలో సాక్షి సంతకాలు పెట్టాలి. ఎటువంటి ఆటంకాలు లేకపోతే ఒక్కరో జులోనే సర్టిఫికెట్ అందజేస్తారు.



నినాదాలు చేస్తున్న పామాయిల్ రైతులు


దిగుమతి సుంకం తగ్గింపు తగదు

- యర్రగుంటపల్లిలో పామాయిల్ రైతుల సమావేశం

చింతలపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం 25.5 శాతం నుంచి 10 శాతం తగ్గించి 15.5 శాతం చేయడం వల్ల పామా యిల్ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని యర్రగుంట పల్లిలో ఆదివారం జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పి.సోమశేఖర్, గోద్రేజ్ పామా యిల్ ఏరియా అధ్యక్షుడు పి.రామరాజు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పది శాతం పామాయిల్ పట్ల దిగుమతి సుంకం తగ్గించడం పట్ల స్థానిక రైతులకు నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ రైతులను దృష్టిలో పెట్టుకుని దిగుమతి సుంకం 50 శాతం తగ్గకుండా చర్యలు తీసుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. పామాయిల్ ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.20 వేల వరకు ఉన్నందున కనీసం మద్దతు ధర టన్ను 20 వేలు తగ్గకుండా కేంద్రం దృష్టికి తీసుకురావాలన్నారు. క్రూడ్ ఆయిల్ ధర టన్ను లక్షా 25 వేల రూపాయలకు తగ్గకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మూడు తీర్మానాలను రైతులు ఏకగ్రీవంగా ఆమోదించి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు పంపామని తెలిపారు. ఈ సమస్యపై భవిష్య త్తులో ఉద్యమం తీవ్రతరం చేయడానికి రైతులు సమాయత్తంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో 60 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

సన్ డే

- భానుడి భగభగలు
- రోహిణి కార్తె ఎఫెక్ట్
- ఏలూరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



లోపలి పేజీలో..

క్యాన్సర్‌తో పోరాడి..
కిరీటాన్ని గెలుచుకుని..

చిన్నప్పుడు ఏదైనా చిన్న దెబ్బతగిలితేనే ఎంతో హైరానా పడిపోతారు అందరూ. కానీ క్యాన్సర్ అంటే ఏంటో సరిగా తెలియని వయసులోనే దాని బారిన పడి పోరాడి గెలిచి నేడు ప్రపంచ సుందరిగా నిలిచారు ఓపల్ సుచాత షుంగ్‌సిరి. క్యాన్సర్‌తో తనలా ఎవరు ఇబ్బంది పడకూడదని 'ఓపల్ ఫర్ హర్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ప్రారంభించారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు ఈ థాయ్‌లాండ్ భామ. ఈ ప్రాజెక్ట్ గురించి పలు సందర్భాల్లో ఆమె పంచుకున్న సంగతులు..



ఆరోగ్యమే ప్రధానం

క్యాన్సర్ నన్ను, నా ఆలోచనలను ఎంతో మార్చింది. మనిషి జీవితంలో ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఆరోగ్యం ఉంటేనే తన లక్ష్యాలు చేరుకోగలరు, ఏదైనా సాధించగలరు.

నాకు పదహారవ ఏటనే రొమ్ములో కణితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలిసినప్పుడు ఎంతో బాధ పడ్డా, భయపడ్డా. నాకిక భవిష్యతే లేదని నిరాశ చెందా. కానీ భయంలో నుంచి నాలో ధైర్యం పుట్టుకొచ్చింది. దానితో క్యాన్సర్‌ను జయించా. అయితే ఆ పరిస్థితుల్లో నా కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం నాకెంతో అండగా నిలబడింది. మరి నాలా ఇలాంటి అండ లేని వారి పరిస్థితి ఏంటనే ఆలోచనే 'ఓపల్ ఫర్ హర్' స్థాపనకు పునాది అయింది.

నాలా అండ లేని వారి కోసం


క్యాన్సర్ సంక్లిష్ట సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను తెలిసిన వారితో పంచుకున్నాను. నేను చెప్పిన ఆ అనుభవాలు తమకు స్ఫూర్తినిచ్చిందని, తామూ క్యాన్సర్‌ను జయించామని కొందరు చెప్పారు. అప్పుడే క్యాన్సర్ రోగులకు అవగాహనతో పాటు మనోధైర్యాన్ని అందించాలని అర్థమయింది. నాలానే క్యాన్సర్‌ను జయించిన వారి జీవిత కథలు చెప్పి మరికొందరికి జీవితం మీద ఆశ కలిగించాలని నిర్ణయించుకున్నా. ఆలోచన అయితే ఉంది కానీ దానిని సరైన వేదిక లేదు. 'ఓపల్ ఫర్ హర్' స్థాపనతో ఆ వేదిక దొరికింది.

నా సంపాదన కూడా..

'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్ట్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, దానిని ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకత తెలియజేశా. క్యాన్సర్‌ను జయించిన వారితో పాడ్‌కాస్టులు, వైద్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంతో మందిలో ఆత్మస్థైర్యం నింపడం ప్రారంభించా. అయితే ఆ తరువాత నాకో భయంకరమైన చేదు నిజం తెలిసింది. అదేంటంటే చాలా మందికి ఆస్పత్రులకు వెళ్లేందుకు డబ్బులు లేవని. దాంతో అలాంటి వారి కోసం నిధుల సేకరించడం మొదలుపెట్టా. నా సంపాదన కూడా నిరుపేద మహిళల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేశా. ఆపై ఆస్పత్రులు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, లాభాపేక్ష లేని సంస్థలు ఆర్గనైజేషన్లు, థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖతో కలిసి పనిచేయడం ప్రారంభించా. ఇలా ఇప్పటి వరకూ ఎంతోమంది థాయ్ మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించా. ప్రస్తుతం ఈ మిస్‌వరల్డ్ పోటీల ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన గురించి 'ఓపల్ ఫర్ హర్' స్వరాన్ని ప్రపంచమంతా వినిపించగలిగా.

ప్రపంచమంతా విస్తరించాలి..

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. థాయ్‌లాండ్‌లోనే ఏటా సుమారు 2 వేల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీటిలో 5 శాతం కంటే తక్కువ కేసులు మాత్రమే తొలి దశలో బయటపడుతుండడం బాధాకరం. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులభంగా దానిని జయించవచ్చు. అందుకే 'ఓపల్ ఫర్ హర్' కేవలం థాయ్‌లాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అనుకుంటున్నా. ప్రపంచ నలుమూలల ఉన్న రొమ్ము క్యాన్సర్ బాధితులకు జీవితంపై ఆశలు రేకెత్తించాలని భావిస్తున్నా.



క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు!

మన వాళ్లకు క్రికెట్ అంటే పిచ్చి. గ్రౌండ్‌లో అయినా మొబైల్‌లో అయినా.. "ఈ మధ్యకాలంలో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా క్రికెట్ గేమ్ ఆడటం బాగా పెరిగింది.." అంటారు 'రియల్ క్రికెట్' అనే మొబైల్ గేమ్‌ను అభివృద్ధి చేసిన టీమ్‌లో ఒకరైన అంజూ మన్‌కర్. ఆమెను నవ్య పలకరించినప్పుడు ఈ గేమ్‌కు సంబంధించిన అనేక విశేషాలు వెల్లడించారు.

"క్రికెట్ చాలా మందికి జీవితాల్లో ఒక భాగం. వీరిలో ఎక్కువ మంది గ్రౌండ్స్‌కు వెళ్లి ఆడలేరు. దీనితో మానిటర్స్ ముందు.. మొబైల్స్‌లోను ఆడుతూ ఉంటారు. గతంలో ఈ గేమ్స్‌కు కొన్ని పరిమితులు ఉండేవి. మాకు 2013లో ఒక మంచి క్వాలిటీ ఉన్న క్రికెట్ గేమ్‌ను తయారుచేయాలనే ఆలోచన కలిగింది. ఫుట్‌బాల్‌లో మనకు మంచి మంచి మొబైల్ గేమ్స్ ఉన్నాయి. అలాంటిది మనం కూడా తయారుచేస్తే- ప్రపంచమంతా దానిని ఆడతారు అనే ఆలోచనతో రియల్ క్రికెట్‌ను అభివృద్ధి చేయటం ప్రారంభించాం. అప్పుడు మా టీమ్ కేవలం ఆరుగురు మాత్రమే! మేము దీనిని అభివృద్ధి చేసిన తర్వాత 2020లో జాక్‌సన్ డైస్ అనే కంపెనీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలోనే క్రాఫ్టన్ అనే కంపెనీ కూడా భాగస్వామిగా చేరింది. క్రాఫ్టన్ మాతో చేరటం వల్ల అంతర్జాతీయంగా ఈ గేమ్‌కు మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నా. మొదట్లో ఈ గేమ్‌ను తయారుచేసినప్పుడు కొన్ని లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసేకొనేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 50 కోట్లకు చేరింది.

చాలా కష్టం..

గేమింగ్ అంటే చాలా మంది సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే చాలు అనుకుంటారు. గేమింగ్‌లో సాఫ్ట్‌వేర్ ఎంత ప్రధానమో.. కళాత్మకంగా ఉండటం కూడా అంతే ప్రధానం. క్రికెట్‌లాంటి గేమ్‌ను అభివద్ధి చేయటం ఒక కోణం నుంచి చూస్తే పెద్ద సవాల్ అనే చెప్పాలి. మరో కోణం నుంచి చూస్తే కొంత సులువు అనే చెప్పాలి. ఈ కారణాలు నేను వివరిస్తాను. షూటింగ్‌లాంటి గేమ్‌ను తయారుచేస్తున్నామనుకుందాం. చాలా మందికి షూటింగ్‌లో రూల్స్ తెలియవు. అందువల్ల వారికి ఆ రూల్స్ సులభంగా అర్థమయ్యేలా గేమ్‌ను తయారుచేయాలి. ఇది ఒక పెద్ద సవాల్. క్రికెట్‌లాంటి గేమ్‌లో రూల్స్ అందరికీ తెలుసు. అందువల్ల ఈ రూల్స్‌ను ఆడేవారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఉండదు. అయితే ఈ గేమ్ వాస్తవిక ప్రపంచానికి దగ్గరగా ఉండాలి. భావోద్వేగాలు ఉండాలి. ఆడేవ్యక్తికి నిజంగా గ్రౌండ్‌లో ఉన్నంత భావన కలగాలి. ప్రతి రోజు గ్రౌండ్‌లో ఆడినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో.. వాటన్నింటినీ బేరీజు వేసుకుంటూ ఈ గేమ్‌ను అభివృద్ధి చేయాలి. ఒక రోజులో రెండు గంటలు ఈ గేమ్ ఆడినా బోరు కొట్టకూడదు. లేకపోతే గేమర్స్ దీనిని ఆదరించరు. అందువల్ల మేము ఈ గేమ్‌ను తయారుచేసేటప్పుడు చిన్న చిన్న విషయాలపై కూడా దృష్టి పెట్టాం. లేకపోతే గేమర్స్ దీనిని వదిలేసి ఇతర గేమ్స్‌లోకి వెళ్లిపోతారు.

అమ్మాయిలు కూడా..

ఒకప్పుడు క్రికెట్ కేవలం పురుషుల ఆట మాత్రమే. భారత ఉపఖండంలో ఇప్పటికీ ఎక్కువ మంది అబ్బాయిలే ఈ గేమ్‌ను ఆడతారు. అయితే ఈ మధ్యకాలంలో ఈ గేమ్‌ను ఆడుతున్న అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉదాహరణకు ప్రతి రోజూ మా గేమ్‌ను 20 లక్షల మంది ఆన్‌లైన్‌లో ఆడుతూ ఉంటారు. వీరిలో 11 శాతం అమ్మాయిలు ఉంటారు. మా దగ్గర ఉన్న గణాంకాల ఆధారంగా చూస్తే వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. భవిష్యత్‌లో మరింతగా పెరుగుతుంది. మేము అమ్మాయిల టీమ్‌లతో ప్రత్యేకమైన గేమ్‌ను తయారుచేయాలనుకుంటున్నాం. ఇక ఏ ప్రాంతంలో ఎక్కువగా క్రికెట్ గేమ్‌ను ఆడతారు అనే విషయాన్ని గమనిస్తే- మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు.. హైదరాబాద్ అని చెప్పవచ్చు. ఇక్కడ నుంచి మా గేమ్‌ను ఎక్కువగా ఆడతారు.

గేమింగ్‌లో తక్కువే..

గేమింగ్ అనేది ఒక ప్రత్యేకమైన క్రీడ. ఈ గేమ్స్‌ను తయారుచేసే కంపెనీలు కూడా ప్రత్యేకమైనవే! అయితే మహిళా గేమింగ్ డెవలపర్స్ ప్రస్తుతం తక్కువనే చెప్పాలి. ఒక కంపెనీలో 10 మంది మగ డెవలపర్స్ ఉంటే.. అమ్మాయిలు ఇద్దరు మాత్రమే ఉంటారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒకటి- గేమింగ్‌ను ఒక సీరియస్ ఐటీ పరిశ్రమగా భావించకపోవటం. ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న పరిశ్రమ ఇది. కానీ దీనిని ఐటీలో భాగంగా భావించరు. ఈ ధోరణిలో మార్పు వస్తే ఎక్కువ మంది అమ్మాయిలు గేమింగ్ అభివృద్ధిలో పాలుపంచుకుంటారు. ఇక చిన్నప్పటి నుంచి అమ్మాయిలు కళల వైపు వెళ్లాలని.. అబ్బాయిలు ప్లే స్టేషన్స్ వంటివి ఆడాలనే భావన తల్లితండ్రుల్లో ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో ఈ విభజన చెరిగిపోతోంది. అమ్మాయిలు కూడా ప్లేస్టేషన్ల వంటివి ఆడుతున్నారు. ఇంకో పదేళ్లలో ఈ విభజన పూర్తిగా చెరిగిపోతుంది. ఆ సమయానికి గేమింగ్‌కు ఐటీ పరిశ్రమలో ఒక సముచిత స్థానం లభిస్తుంది. అప్పుడు క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు ఉందని చెప్పాలి.

దోమలను పారద్రోలే మొక్కలు ఇవే..!

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం కాగానే గుంపులుగా దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇవి రాత్రిపూట నిద్రపోనివ్వవు. వీటివల్ల పలు రకాల వ్యాధులు కూడా సోకుతాయి. దోమలను నివారించేందుకు ఇంటి చుట్టూ కొన్ని రకాల మొక్కలు పెంచితే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.



- ఇంటి ప్రధాన ద్వారానికి ఎదురుగా తులసి మొక్కను ఏర్పాటు చేస్తే దోమలు లోనికి రావు. బాల్కనీలు, కిటికీల గోడల మీద కూడా చిన్న కుండీల్లో తులసి మొక్కను పెంచవచ్చు.
- ఇంటి పరిసరాల్లో యూకలిప్టస్, నీలగిరి మొక్కలు పెంచితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఈ మొక్కలు విడుదల చేసే ఘాటైన వాసనలకు దోమలు నశించిపోతాయి.
- చాలామంది దోమలు వచ్చే సమయానికి ఇంటి తలుపులు మూసేస్తూ ఉంటారు. అయినప్పటికీ బాల్కనీలు, కిటికీల నుంచి దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు ఆ ప్రదేశాల్లో వెడల్పాటి కుండీలు ఏర్పాటు చేసి పుదీనా, నిమ్మ గడ్డి, రోజ్‌మేరీ, లావెండర్, బంతిపూల మొక్కలు పెంచాలి. ఈ మొక్కల ఆకులు, పూల నుంచి వెలువడే సువాసనలు సరిపడక దోమలు దూరంగా పారిపోతాయి. ఈ మొక్కల కుండీలను ఇంట్లో అమర్చుకుంటే దోమలన్నీ బయటికి వెళ్లిపోతాయి.



- సిట్రోనెల్లా అనేది ఓ గడ్డి మొక్క. ఇది సుగంధాన్ని వెదజల్లుతుంది. ఈ మొక్కని కిటికీల దగ్గర, ఇంటి చుట్టూ గోడల వెంబడి పెంచితే దోమలు దూరంగా వెళ్లిపోతాయి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రదేశంలో వెల్లుల్లి మొక్కను పెంచితే పది రోజుల్లో దోమలన్నీ నశించిపోతాయి.
- గుమ్మానికి ఇరుపక్కలా హార్స్‌మింట్, స్నేక్‌ప్లాంట్, ఆలియం, సేజ్, జెరేనియం మొక్కల కుండీలు పెడితే దోమలు ఇంట్లోకి రావు.
- గడ్డి చేమంతి మొక్క కూడా దోమలను పారద్రోలుతుంది. దీని పూలు పసుపు, తెలుపు, ఎరుపు, గులాబీ, ఊదా రంగుల్లో ఉంటాయి. ఇంటి ముందు వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఈ మొక్కను పెంచితే ప్రయోజనం ఉండడమే కాకుండా పరిసరాలు అందంగా కనిపిస్తాయి.



అంజలి సూద్... భారత సంతతికి చెందిన ఈ అమెరికన్ గురించి ఇప్పుడు నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. కారణం... ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం... 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' (పర్యవేక్షక మండలి) సభ్యురాలిగా ఆమెను ఎంపిక చేయడం. అమెరికా ఓటీటీ 'ట్యూబి' సీఈఓగా ఉన్న అంజలి... గతంలో విమియో, అమెజాన్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి... లాభాల బాట పట్టించారు. 'విద్యాశక్తి ద్వారా అమ్మానాన్నలు నా గురించి కన్న కలలను నిజం చేశాను. దాన్ని రేపటి తరానికి అందించాలని కోరుకొంటున్నాను' అంటున్న 41 ఏళ్ల అంజలి విజయ ప్రస్థానం ఇది.

న్యూస్‌మేకర్

ఆమె పయనం... సమున్నతం



అమెరికాలో ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం... హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య వివాదం తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ తరుణంలో అంజలి వర్సిటీ 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా ఎంపిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవిలో ఆమె రెండేళ్లు కొనసాగుతారు. 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్'.. హార్వర్డ్ రెండో అత్యున్నత పాలకమండలి. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన మార్క్ కార్నే బోర్డులో తన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో, ఆ ఖాళీని అంజలితో భర్తీ చేసింది వర్సిటీ. ఆమె హార్వర్డ్ పూర్వ విద్యార్థిని కూడా.

అదే వర్సిటీలో...

అంజలిది అమెరికాలో స్థిరపడిన పంజాబీ కుటుంబం. డెట్రాయిట్‌లో పుట్టిన ఆమె... ఫ్లింట్ నగరంలో పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో 'ఫిలిప్స్ అండోవర్ అకాడమీ'లో చదివేందుకు మసాచుసెట్స్ వెళ్లారు. 2005లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ పూర్తి చేశారు. 2011లో హార్వర్డ్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. ఇప్పుడు అదే వర్సిటీ పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు.

ఉన్నత హోదాలు...

బీఎస్సీ అవ్వగానే ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించిన అంజలి కెరీర్ వాయు వేగంతో దూసుకుపోయింది. 2005- 2014 మధ్యకాలంలో ఆమె సాజెంట్ అడ్వైజర్స్, టైమ్ వార్నర్, అమేజాన్‌లలో ఫైనాన్స్, మీడియా విభాగాల్లో పని చేశారు. తరువాత 'విమియో' గ్రూప్‌లో గ్లోబల్ మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల తిరక్కుండానే ఆ కంపెనీకి సీఈఓ అయ్యారు. అంజలి సారథ్యంలో కంపెనీ కంటెంట్ ప్రొడక్షన్ నుంచి కంటెంట్ క్రియేటర్లకు సాఫ్ట్‌వేర్ టూల్స్ అందించే స్థాయికి ఎదిగింది. ఎన్నడూ చూడని లాభాలను ఆర్జించింది. ప్రత్యక్ష ప్రసారాలకు ఉద్దేశించిన 'లైవ్ స్ట్రీమ్', వీడియో ఎడిటింగ్ కోసం తెచ్చిన 'మ్యాజిస్టో' యాప్‌లతో పాటు 'వైర్‌మ్యాక్స్, విబ్బిట్జ్' సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌లను 'విమియో' సొంతం చేసుకోవడంలో అంజలిదే ప్రముఖ పాత్ర.

విజయ పరంపర...

దాదాపు పదేళ్లపాటు విమియో విజయాల్లో భాగస్వామి అయిన అంజలి... 2023లో కంపెనీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ఫాక్స్ కార్పొరేషన్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన 'ట్యూబి' సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో ఉచితంగా సినిమాలు, టీవీ షోలు అందించే ఓటీటీ వేదిక ఇది. అంజలి చేరికతో కంపెనీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. నెలకు దాదాపు పది కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారంటే... అందులో ఆమె కృషి గురించి ప్రధానంగా చెప్పుకోవాలి.

కొత్త బాధ్యతలు...

తాజాగా హార్వర్డ్ వర్సిటీ బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్‌కు ఎంపిక కావడంతో తన కల నెరవేరిందంటారు అంజలి. 'మా అమ్మానాన్న నా గురించి ఎన్నో కలలు కన్నారు. విద్యాశక్తి ద్వారా ఆ కలలను నేను సాకారం చేయగలిగాను. దీన్ని తరువాతి తరాలవారికి అందించాలనేది నా సంకల్పం' అంటున్న అంజలి... హార్వర్డ్ అందుకు సరైన వేదికగా భావిస్తున్నారు. అంతేకాదు... ఆమె ప్రస్తుతం 'సిరియస్ ఎక్స్‌ఎమ్, డోల్బీ లేబరెటరీస్'కు బోర్డు మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'చేంజ్ డాట్ ఓఆర్జీ'కి ఛైర్మన్‌గా ఉన్నారు.

అందరిలో ఆసక్తి...

హార్వర్డ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థుల సమాచారం ప్రభుత్వానికి ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీంతో అటు వర్సిటీకి, ఇటు ట్రంప్ ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వర్సిటీ పాలక మండలిలో అంజలి కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కార్యాచరణ ఎలా ఉంటుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

అవార్డులు ఎన్నో...

ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ 40 అండర్ 40' జాబితాలో చోటు దక్కించుకున్న అంజలి ఎన్నో అవార్డులు, గౌరవ సత్కారాలు అందుకున్నారు. 2019లో ఆమెకు 'న్యూయార్క్ ఉమెన్ ఇన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్' అవార్డు లభించింది. గత సంవత్సరం 'ది హాలీవుడ్ రిపోర్టర్' ప్రకటించిన వినోద రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో అంజలికి చోటు దక్కింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆమె నికర ఆదాయం దాదాపు రూ.73 కోట్లు. ఇదంతా వివిధ కంపెనీలకు అందించిన సేవల ద్వారా పొందిన ప్రతిఫలం. సాధించాలన్న పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే ఏ లక్ష్యం పెద్దది కాదని అంజలి నిరూపించారు. కలలను ఛేదించి... భావితరాలకు స్ఫూర్తిమంత్రం అయ్యారు.

శాండ్‌విచ్‌లు అందంగా...

మనం సాధారణంగా శాండ్‌విచ్‌లు చేసుకుని తింటూ ఉంటాం. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని అందంగా రూపొందించి చక్కగా పళ్లెంలో అమర్చాలని అనుకుంటాం. చూడగానే ఆకట్టుకునేలా శాండ్‌విచ్‌లను ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...



- ఒక బ్రెడ్‌ను తీసుకుని రెండు త్రిభుజాకారపు ముక్కలుగా కోయాలి. రెంటినీ ఒకదాని పక్కన మరోదాన్ని కాస్త ఎడంగా పెట్టాలి. వీటిపైన పాలకూర ఆకును పెట్టాలి. దీనిమీద టమాటా ముక్కలు, చీజ్ తురుం, కొత్తిమీర చీలికలు, ఇతర కూరగాయల ముక్కలు (కేరట్, కీరా, బీట్‌రూట్ లాంటివి) అమర్చాలి.




- ఈ రెండు త్రిభుజాకారపు బ్రెడ్ ముక్కలను ఒకదానితో మరోదాన్ని మూసివేయాలి. లోపల ఉన్న కూరగాయల ముక్కలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఒక పొడవాటి ప్లాస్టిక్ కవర్‌తో ఈ రెండు ముక్కలను కలిపి చుట్టాలి.
- ఒక శాండ్‌విచ్ పేపర్‌ను తీసుకుని పొడవాటి దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించాలి. ఈ పేపర్‌తో ముందుగా తయారుచేసుకున్న శాండ్‌విచ్‌ను కోన్ మాదిరి చుట్టాలి. తరవాత ఒక పళ్లెంలో జాగ్రత్తగా పెట్టాలి. శాండ్‌విచ్ పేపర్‌మీద సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఏదైనా రాయవచ్చు.



- పళ్లెంలో ఖాళీ ఉన్నట్లయితే కూరగాయల ముక్కలను అందమైన ఆకృతుల్లో పేర్చవచ్చు. అవసరమైతే మొలకలు, డ్రైఫ్రూట్స్ కూడా చేర్చవచ్చు.

ఎండుద్రాక్ష నీళ్లతో ప్రయోజనాలు



డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. అందుకే చాలామంది ఉదయాన్నే నానబెట్టిన బాదం, ఎండుద్రాక్ష తింటుంటారు. అయితే పరగడుపున నల్ల ఎండుద్రాక్ష నీళ్లను తాగడం వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. అది అజీర్తి సమస్యలను దూరం చేస్తుంది.
- ఈ నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- ఈ నీళ్లలో సహజసిద్ధంగా ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.
- ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనత దరిచేరకుండా చేస్తాయి.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం బీపీని నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగిస్తాయి. దాంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ఈ నీళ్లలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దూరం చేస్తాయి
- 10- 15 నల్ల ఎండు ద్రాక్షలను తీసుకుని నీళ్లతో బాగా కడిగాలి. ఇప్పుడు వాటిని ఓ గ్లాసుడు మంచి నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పరగడుపున ఆ నీటిని తాగేయాలి. నానబెట్టిన ఎండుద్రాక్షలను కూడా తినేయవచ్చు.

ఇస్రో శిక్షణకు దండగర్ర విద్యార్థులు


పద్మశ్రీ


ప్రదీప్తి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఇస్రో నిర్వహించే యువ విజ్ఞాన కార్యక్రమానికి తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వీరమళ్ల పద్మశ్రీ, మైనం ప్రదీప్తిలు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా సూళ్లూరి పేటలో వీరితో పాటు మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 49 మంది విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఇస్రో చేసే ప్రయోగాలు వాటి అవసరం, దేశానికి యువ శాస్త్రవేత్తల ప్రాముఖ్యత తదితర అంశాలు వివరించారు. అంతే కాకుండా లాంచ్ ప్యాడ్, ప్రయోగ కేంద్రం, చెన్నైలోని మ్యూజియాన్ని చూపించారు. శిక్షణ అనంతరం నిర్వహించిన క్విజ్‌లో వీరమళ్ల పద్మశ్రీ, మైనం ప్రదీప్తిలతో కూడిన 12 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి అక్కడి నుంచి ప్రశంసా పత్రాలు సైతం సాధించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన మాస్టారు శివరామకృష్ణలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, సర్పంచ్ పిల్లా రాంబాబు, ఎంఈవో వి.హనుమలు అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

▸▸ బదిలీల్లో గందరగోళంపై ఏపీటీఎఫ్ అసహనం

ఏలూరు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సాధారణ బదిలీల్లో అస్తవ్యస్త నిర్ణయాల వల్ల గందరగోళం నెలకొందని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు,రెడ్డిదొర ఆరోపించారు. ఉన్నతాధికారులు రోజుకొక విధానాలతో టీచర్లను అయోమయానికి గురి చేస్తున్నారని వివరించారు. మిగులు స్కూల్ అసిస్టెంట్లు మోడల్ ప్రైమరీస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా ఖచ్చితంగా వెళ్లాల్సిందేనంటూ జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు మౌఖిక ఆదేశాలివ్వడం సరైన విధానం కాదన్నారు. హైస్కూళ్లలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించి ఉంటే సర్‌ప్లస్ టీచర్ల సమస్య తలెత్తేదికాదని, ఇంకా సుమారు 10వేల మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల కొరత ఉండేదన్నారు. తెలుగు మీడియాన్ని కొనసాగిస్తామని అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం హామీఇచ్చి, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలోని ఆరురకాల బడుల విధానాన్ని సరిచేస్తామని, తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని చెప్పి ఇప్పుడు ఏకంగా 9రకాల బడులు, ఆంగ్ల మాధ్యమంతో సర్‌ప్లస్ సమస్యను సృష్టించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను గందరగోళపరచకుండా హైస్కూళ్లలో తెలుగు మీడియంను కొనసాగించి, ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

5 నుంచి భీమవరంలో చెస్ టోర్నమెంట్

భీమవరం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో 5న భీమవరం వన్‌టౌన్‌లోని ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో ఇన్విటేషనల్ ఓఎన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు అనసూయ చెస్ అకాడమీ కోచ్ మాదాసు కిశోర్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటు అండర్ 5, అండర్ 7, అండర్ 9, అండర్ 11, అండర్ 13, అండర్ 15, బాలబాలికలకు ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మొక్కను అందజేస్తామన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు తోట హరిబాబులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలన్నారు. ఈ టోర్నమెంట్‌కు వివిధ జిల్లాలనుంచి క్రీడాకారులు విచ్చేస్తారని నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్, తదితరులు పాల్గొన్నారు.


కుంభం పోస్తున్న భక్తులు

జాలిపూడిలో ఘనంగా గంగానమ్మ జాతర

ఏలూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జాలిపూడి గ్రామంలో గత నెల 14న ప్రారంభమైన గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఈ మేరకు భక్తులు పెద్ద ఎత్తున కుంభం పోసి అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. గ్రామమంతా భక్తుల కోలాహలంతో, ఆధ్యాత్మిక చింతనతో వెల్లివిరిసింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నెక్సజెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసి భద్రతా చర్యలను పర్యవేక్షించారు. శనివారపుపేట శ్రీరామ్ నగర్ తొమ్మిదో రోడ్డు చివర గవరవరం చెరువు గట్టు వద్దఉన్న గంగానమ్మ ఆలయం 13వ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆదివారం ఉదయం 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం నడుమ అమ్మవారిని ఊరేగించారు. శ్రీలక్ష్మీ గణపతి గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల మోహన్ రావు, గుత్తుల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఏలూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పేదింటి యువతి వివాహానికి ఆదివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అప్పలభక్తుల శివకేశవరావు అందజేశారు. కుమ్మరి వృత్తి ద్వారా జీవనం సాగించే చిట్టూరి సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ద్వితీయ కుమార్తె వివాహం నిమిత్తం ఆర్థిక సాయం కోసం విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, జిల్లా సంఘాన్ని ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ సంఘీయులు, విరాట్ సేవా ట్రస్ట్, ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం, శ్రీవిశ్వబ్రాహ్మణ సంఘం, వడ్రంగి పనివారల సంక్షేమ సంఘ సభ్యులు, సుమారు లక్షా 50వేల రూపాయలు అందించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం కొంత నగదును ఆ కుటుంబానికి అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు లక్కోజు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లంకపల్లి జగదీష్, కొత్తల శివకుమార్ ట్రస్టు సభ్యులు, వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్లూరి శివరావు, సంఘం నాయకులు అద్దంకి సత్యనారాయణ కామకోటి సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలను ప్రాక్టీస్ చేస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికుల యోగాంధ్ర

ఏలూరు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు కోటదిబ్బలోని సంఘ కార్యాలయ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు, మాజీ సార్జెంట్ కె.ఆదినారాయణ మాజీ సైనికులతో యోగాసనాల ప్రాక్టీస్ చేయించారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి కె.వి.సాయిప్రసాదరావు, మాజీ సైనికుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, బి.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



సన్ డే

▸▸ భానుడి భగభగలు

▸▸ రోహిణి కార్తె ఎఫెక్ట్

▸▸ ఏలూరులో 42 డిగ్రీలు, భీమవరంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఏలూరు సిటీ/భీమవరం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం భానుడి సెగలు కనిపించాయి. రోహిణి కార్తె ఎండ కనిపించిందిద. ఒకవైపు నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయంటున్నారు. మరో పక్క బంగాళాఖాతంలో తుపాన్ ప్రభావం వల్ల వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నిన్న మొన్నటి వరకు ఏ ప్రాంతంలో చూసినా మబ్బులతో వాతావరణం, పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. గత వారం రోజుల్లో 34 నుంచి 36 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదయ్యాయి. వృద్ధులు, పిల్లలు ఉక్కబోతను తట్టుకోలేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలు సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. ఆదివారం ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు రహదారులపై ప్రయాణించటానికి చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఏలూరు జిల్లా ఏలూరు, నూజివీడు, నిడమర్రు, ఉంగుటూరు, బుట్టాయగూడెం, కుక్కునూరు, పోలవరం, పెదవేగి, పెదపాడు, భీమడోలు, ద్వారకాతిరుమలలో 42 డిగ్రీలు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, పాలకొల్లు పట్టణాల్లో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన ఎయిర్ కూలర్లు


మెట్లదారి వెంబడి ప్రవహిస్తున్న నీటిపై నడుస్తున్న భక్తులు

శ్రీవారి సన్నిధిలో కూల్‌కూల్‌గా..

▸▸ దేవస్థానం చర్యలతో భక్తులకు ఉపశమనం

ద్వారకాతిరుమల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రోహిణికార్తె వచ్చి వారం రోజులైనా చూపని ఎండ ప్రభావం శ్రీవారి క్షేత్రానికి ఆదివారం వచ్చిన భక్తులపై చూపింది. తీవ్రంగా కాసిన ఎండకు ఆలయానికి వచ్చిన భక్తులు అల్లాడారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా దేవస్థానం పలు చర్యలు తీసుకుంది. భక్తులు రాకపోకలు సాగించే ప్రధాన రాజగోపురం రాతి మెట్ల రహదారిలో పాదాలకు ఎండ వేడి తగులకుండా నిరంతరం నీటిని విడుదల చేసేలా ఏర్పాట్లు చేసింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్పెట్లపైన, కూల్ పెయింట్లపై భక్తులు నడిచి వెళ్లి ఉపశమనం పొందారు. క్యూలైన్ల మీదుగా శ్రీవారి దర్శనానికి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం కొన్నిప్రాంతాల్లో కూలర్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.



శ్రీవారి దర్శనానికి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు.. శ్రీ గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

▸▸ యాత్రికులతో కిటకిటలాడిన ద్వారకాతిరుమల క్షేత్రం ▸▸ గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యసన్నిధి ఆదివారం భక్తజనులతో నిండిపోయింది. శ్రీవారి నామస్మరణ మార్మోగింది. సెలవురోజు కావడం వల్ల ఆలయానికి విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తుల రాకతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. దాదాపు 15వేలకు పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం వారు స్వామి వారి ఉచిత తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

- క్షేత్రదేవతగా విరాజిల్లుతున్న శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారు ఆదివారం భక్తులకు ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక కుంకుమ పూజలు జరుపుకున్నారు.

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వనదేవత శ్రీగుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వర్షాలు కురుస్తున్నందున అమ్మవారి దర్శనాలకు భక్తుల తాకిడి పెరుగుతుంది. అధిక వర్షాలు కురిస్తే ఏజెన్సీ ప్రాంతం కావడంతో వాగులు పొంగు ప్రవహిస్తా ఉంటాయి. అందుకే పొడి వాతావరణం ఉండగానే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని భక్తులు అధిక సంఖ్యలో ఏజెన్సీకి తరలివస్తున్నారు. ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఆలయ కమిటీవారు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి శ్రీ కృష్ణుడి ఆలయ ప్రతిష్ఠ పూజలు


చెక్కపల్లిలో నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయం

ముసునూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు నండూరి మధుసూధన్, పాకనాటి రాజారావు, తలకొండ భాస్కరరావు, కందుల పిచ్చియ్య తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఉదయం 8.01 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ, శిఖర, కలశ, ద్వారపాలక, బొడ్డురాయి స్థాపనలు జరుగుతాయని తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ రోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

నిలకడగా కూరగాయల ధరలు



పెంటపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌లో ఆదివారం కూరగాయల ధరలు నిలకడగా కొనసాగాయి. గత వారం మాదిరిగా ఉల్లిపాయలు రకాన్ని బట్టి 4 కేజీలు రూ.100, 5 కేజీలు రూ.100 అమ్మకాలు సాగించారు. ఉల్లిపాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరలు నిలకడగా కొనసాగాయి కేజీ టమోటో రూ.20, బీరకాయలు కేజీ రూ.50, దొండకాయలు రూ. 30, తెల్లవంకాయిలు కేజీ రూ.50, నల్ల వంకాయలు కేజీ రూ.40, అల్లం కేజీ రూ.60, మునకాయలు 3 రూ.20, అనపకాయ రూ.15, దోసకాయలు రూ.30, అరిటికాయలు 3 రూ.20, క్యాబేజి రూ.30, బీట్‌రుట్ కేజీ రూ.40, బిన్నీస్ కేజీ రూ. 80, కాప్సికం కేజీ రూ.60, పచ్చి మిరప కాయలు కేజీ రూ.40లకువిక్రయాలు సాగాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి మృతి

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి సమీపంలో ఉన్న చెరువులో పడి ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన మోరు లక్ష్మి (84)కు భర్త మరణించగా వారి ఇద్దరు కుమారులు కూడా మరణించారు. అదే గ్రామంలో ఉన్న ఇద్దరు కోడళ్ళ వద్ద ఒక నెల ఒకరి ఇంటి వద్ద, మరో నెల ఒక కోడలి ఇంటి వద్ద ఉంటూ జీవిస్తున్నది. చిన్న కోడలు మోరు శేషారత్నం ఆ గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్నది. ప్రస్తుతం ఆమె వద్ద ఉంటున్న మోరు లక్ష్మి శనివారం ఉదయం ఇంట్లో ఉండగా ఆమె కోడలు శేషారత్నం స్కూల్‌లోని ఒక ఉపాధ్యాయుడు రిటైర్‌మెంట్ కార్యక్రమానికి వెళ్ళింది. ఆమె తిరిగి వచ్చేటప్పటికి లక్ష్మి కనిపించలేదు. సాయంత్రం వరకూ చూసి గ్రామంలో చాటింపు (టాంటాం) కూడా వేశారు. అయినా ఆమె ఆచూకీ కానరాలేదు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆ ఇంటి సమీపంలో ఉన్న గ్రామ చెరువులో లక్ష్మి మృతదేహం లభించింది. ఆమె ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్లుగా భావిస్తున్నారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్‌కె దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు గుడివాడవారివీధికను చెందిన జంతివాడ సత్యవతి (70) మే 31వ తేదీ శనివారం ఉదయం ఆ వీధిలో ఉన్న గణేష్ ఆలయంలో దీపారాధన చేయడానికి వెళ్ళారు. దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు దీపం ఆమె చీరకు అంటుకుని అగ్ని ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలైంది. ఆమెను విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో సీఐ కె అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీ కొనడంతో ఢీ కొన్న లారీలోని డ్రైవర్ తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద విజయవాడ నుంచి ఏలూరు వస్తున్న ఒక లారీ టోల్‌గేటు సమీపంలో రోడ్డు పక్కన ఆపాడు. అటువైపు నుంచే రాజమహేంద్రవరం సమీపంలోని నామవరానికి చెందిన ఎం సత్యనారాయణరెడ్డి(45) ఆదివారం తెల్లవారుజామున లారీతో రాజమండ్రివైపు వెళుతూ మార్గమధ్యలో కలపర్రు టోల్‌గేటు వద్ద ఆగిన లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణరెడ్డికి తీవ్ర గాయాలు కాగా అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :ఏ కారణమో తెలియదు కాని ఒక యువకుడు పురుగుమందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కైకలూరు మండలం వరహాపట్టణానికి చెందిన కట్టా శ్రీను (24) గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేమవరం వెళ్ళి అక్కడ పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పురుగు మందు తాగిన వృద్ధుడి మృతి


ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పెరవలి మండలం కాకపర్రు గ్రామానికి చెందిన సొంగా కాంతారావు (60) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని తొలుత సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పాముకాటుతో రైతు మృతి



పెదవేగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పొలంలో పనిచేస్తున్న వ్యక్తి పాముకాటుకు గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి శివప్రసాద్, అతని భార్య కనకదుర్గ దంపతులు పొలం సమీపంలోనే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్లిన శివప్రసాద్.. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి వచ్చి, తనను పాముకాటువేసిందని చెప్తూ నోటి వెంట నురగలు కక్కుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సహాయంతో శివప్రసాద్(50)ను ఏలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సారథి



నూజివీడు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. జనరద్దీ ప్రాంతాలు, హాస్పిటల్స్‌లో, రైల్వేస్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్ పోర్టుల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు ఇళ్ల నుంచి అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. విదేశాల నుంచి స్వదేశానికి వచ్చిన వారు కొవిడ్ టెస్ట్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మాస్కులు, పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచాలని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థిలనైనా ఎదుర్కొవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ హాస్పిటల్లో కొవిడ్‌ను ఎదుర్కొవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, మెరుగైన వైద్యానికి వైద్యపరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కొవిడ్‌ను ఎదుర్కొవడానికి గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలని ఆదేశించారు.

మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడిని గుర్తిం చారు. ఏలూరు సమీపంలోని కలపర్రు పాతటోల్ గేటు వద్ద ముందు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వెళ్తున్న మోటారు సైక్లిస్టు దానిని శనివారం రాత్రి ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆ మృతుడిని ఆదివారం గుర్తించారు. గణపవరం మండలం కుమ్మర గ్రామానికి చెందిన అద్దగళ్ళ శ్రీనివాసరావు (35)గా గుర్తించారు. ఈ సంఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వలల చోరీపై కేసు నమోదు

టీ.నర్సాపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టే వలల చోరీపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు మే నెల 29వ తేదీన చేపలవేటకు వెళ్లి 100వలలు అక్కడే ఉంచి మరుసటిరోజు వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. ఆ మేరకు బాధితుల ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

కరెంటువైర్లను తాకిన లారీ


లారీపై పడిన విద్యుత్ స్తంభం

కైకలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భక్తులతో రద్దీగా ఉండే ప్రదేశం, ఇరుకురోడ్డులో వ్యాన్‌ను తీసుకువెళ్లి హైటెన్షన్ విద్యుత్ వైర్లకు పట్టించిన సంఘటనలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం కైకలూరు మండలం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయం వెనుకవైపు కోనేరు సమీపంలో వ్యాన్ విద్యుత్ వైర్లను పట్టించి లాగడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున వాహనాల్లో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అలాగే ఐషర్ వ్యాన్‌పై కొంతమంది భక్తులు ఆలయానికి రాగా వారంతా ఆలయ ముఖఃమండపం వద్ద దిగారు. వ్యాన్‌డ్రైవర్ ఆలయం పక్కన ఉన్న నూతనంగా నిర్మాణం చేసిన సిమెంటురోడ్డు వెంబడి ఇరుకు ప్రదేశంలో బలవంతంగా వ్యాన్‌ను తీసుకువెళ్లాడు. కోనేరు సమీపంలో హైటెన్షన్ విద్యుత్‌వైర్లు పట్టివేశాయి. ఆ సమయంలో వ్యానును బలవంతంగా ముందుకు నడపడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం సైతం విరిగిపడింది. డ్రైవర్ అత్యంత నిర్లక్ష్యంగా వ్యాన్‌ను నడపడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం చోటు చేసుకున్న చోట భక్తులుతో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో భయంతో వైర్లు తెగిన సమయంలో పరుగులు తీశారు. స్తంభం పూర్తిగా విరిగి వ్యాన్‌పై పడిపోవడంతో దానిని తీయకుండా వదిలివేశారు.

ఎర్రకాల్వ మిగులు భూములు గిరిజనులకు కేటాయించాలి

టి.నర్సాపురం, జూన్1(ఆంధ్రజ్యోతి): ఎర్రకాల్వ మిగులు భూములు సాగు చేస్తున్న గిరిజన పేదలకు సాగుహక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, గుడెల్లి వెంకట్రావులు డిమాండ్ చేశారు. మండలంలోని సాలిగూడెంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మిగులు భూముల పోరాట నాయకులు సాగుదారులతో సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు, పేదలకు హక్కులు కల్పించాలన్నారు.

లోఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

టి.నర్సాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి):దోసపాడు పంచాయతీలో లోఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. వెలగపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన మోటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. లోఓల్టేజ్ సమస్యను ఎంపీ మహేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. సర్పంచ్ జలపాలు, వీఆర్వో దత్తు, శీలం సాయివినయ్, జాజుల బుచ్చిబాబు, భాష, పెద్దిరాజు, సూరిబాబు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

నేడు చింతలపూడిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చింతలపూడి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం చింతలపూడి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయి అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో యథావిధిగా సంబంధిత అధికారులతో గ్రీవెన్స్ నిర్వహిస్తామని, అర్జీల నమోదు, ఇందుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవాలన్నారు. చింతలపూడిలో జరిగే వేదికలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొంటారని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

మంచినీటి ట్యాంకులకు ఎమ్మెల్యే చిర్రి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలో మధ్య బర్రింకలపాడు, జీలుగుమిల్లి శివారు రామన్నపాలెం, పి.రాజవరం, చిర్రివారిగూడెం, మడకంవారిగూడెం, పి.అంకంపాలెం, రౌతుగూడెం, ములగలంపల్లి, అంకన్నగూడెం, గోపాలపురం గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఆయన వెంట జనసేన మండల జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, జనసేన టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రమేష్, ఏఈలు వినయ్‌కుమార్, జగదీష్, సర్పంచ్ చిర్రి జగదాంబ ఉన్నారు.


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే ధర్మరాజు

సుప్రీం లోకల్ సెంటర్ పరిశీలన

ఉంగుటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు గ్రామాన్ని జిల్లాలో సుప్రీం లోకల్ సెంటర్‌గా ప్రకటించడంతో ఆ గ్రామం దశ తిరిగింది. దీంతో రోజుకో జిల్లా అధికారి పర్యటించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. కాగా ఆదివారం జేసీ రేషన్ దుకాణాన్ని ప్రారంభించేందుకు వచ్చిన జేసీ ధాత్రిరెడ్డి సుప్రీం లోకల్ సెంటర్‌ను పరిశీలించారు. ఆమెతో పాటు ఎమ్మెల్యే ధర్మరాజు, సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, మాజీ సర్పంచ్ రాంధే రాజారావు, తహసీల్దార్ పాల పర్తి రవికుమార్, ఈ.వో.పి.ఆర్డీ చంద్ర శేఖరన్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వితంతు పెన్షన్లు అర్హులందరికీ ఇవ్వాలి : సీపీఎం

చింతలపూడి, జూన్ 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం వితంతు పెన్షన్లు అర్హులైన అందరికీ ఇవ్వాలని సీపీఎం నాయకులు పాండురంగారావు, ఆర్.వి.సత్యనారాయణ కోరారు. 2024 అక్టోబర్ 31వ తేదీని గడువుగా విధించి వితంతు పెన్షన్లు మంజూరు చేయడం సరికాదన్నారు. ఇది కుటుంబ పెద్దను కోల్పోయిన వారిని వంచించడమేనన్నారు. ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పిందని, కాని అవన్నీ పాత పెన్షన్ల పరిధిలోకే వస్తాయన్నారు. భర్తను కోల్పోయిన భార్యకు ఇస్తూ కొత్త పెన్షన్లు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇందుకు 31.91 కోట్లు భారం పడుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. గడువు తేదీ నిబంధన ఎత్తివేసి భర్తను కోల్పోయిన అర్హులైన వితంతువులందరికీ పెన్షన్ ఇవ్వాలని కోరారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట లోని శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా రుసుములు రూ.38,240లు, లడ్డూ ప్రసాదాల విక్రయాలద్వారా రూ.19725లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.2వేలు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.లక్ష విరాళం అందించారని ఆయన చెప్పారు.

ఏలూరులో సైకిల్ ర్యాలీ

ఏలూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ, యువ భారత్ ఏలూరు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'సైకిల్‌తో ఆదివారం' కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి తంగెళ్లమూడి సర్కిల్ వరకు జరిగింది. కోచ్ సందీప్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సైకిల్ యాత్రలో 40 మంది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రీడాకారులు మేరా యువ భారత్ వలంటీర్లు, యువకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలు గాన లహరి


పాటలు పాడుతున్న గాయని, గాయకులు

ఏలూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన ప్రతిపాట ఆణిముత్యమని మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. 4న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఏలూరు వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుగాన లహరి నిర్వహించారు. తొలుత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర సారథి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని అయన పాడిన పాటలు అజరామరమన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన చిత్రాల్లోని గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. సాహితీ వేత్త లంక వెంకటేశ్వర్లు, దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సొసైటీ గొడౌన్లు.. అక్కరకు వచ్చేలా!

(ఐదో పేజీ తరువాయి)

ఇస్తారు. సొసైటీలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి 21 రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటారు. అక్టోబరు 25వ తేదీలోగా గొడౌన్లను అద్దెకు ఇచ్చే అంశంపై వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. అన్ని పూర్తయ్యాక వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ(డబ్ల్యుడీఆర్ఏ) ఐదేళ్ల కాలానికి రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలను సొసైటీలకు జారీ చేస్తుంది. డబ్ల్యుడీఆర్ఏ అక్రిడేషన్ పొందడం వల్ల సొసైటీల గొడౌన్లకు గుర్తింపు లభించడంతో పాటు స్టోరేజీ వసతుల మెరుగుపడతాయని భావిస్తున్నారు. తద్వారా సొసైటీలకు ఆదాయం జమ అవుతుందని సహకార అధికారులు భావిస్తున్నారు. 'గొడౌన్ల వినియోగానికి యంత్రాంగం ముందుకు రావడం మంచి పరిణామం. త్వరలో వీటిపై తుది నిర్ణయం తీసుకుంటారు. పూర్తి కాని గొడౌన్లకు నిధులు మంజూరు కావాల్సి ఉంది' అని జిల్లా సహకార అధికారి అరిమిల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.


భీమడోలులో రేషన్ అందజేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, గన్ని


ఎనికేపల్లిలో రేషన్ అందజేస్తున్న మాలతీరాణి


బుట్టాయగూడెంలో రేషన్ అందజేస్తున్న బొరగం

అక్రమాలకు చెక్..

అందుకే రేషన్ దుకాణాల్లో సరుకులు అందజేస్తున్నామన్న గన్ని

భీమడోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరగకుండా పేదలకు సక్రమంగా పంపిణీ చేయాలనే ఉద్దేశంతోనే వాహనాలను రద్దు చేసినట్టు ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. భీమడోలులో రేషన్ షాపుల వద్ద రేషన్ పంపిణీని గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే ధర్మరాజు, జేసీ ధాత్రిరెడ్డి పాల్గొని పంపిణీ చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకుల పంపిణీ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి, తహసీల్దార్ రమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: తంగెళ్లమూడిలోని 126వ రేషన్ షాపు, కొబ్బరి తోట మెయిన్ రోడ్ రామాలయం వద్ద ఉన్న 3వ నెంబర్ రేషన్‌షాపు, తూర్పువీధిలో పోతురాజుబాబు గుడి వద్ద ఉన్న 27వ రేషన్ షాపు వద్ద ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సరుకుల పంపిణీని ప్రారంభించారు.ఆయా ప్రాంతాల్లో వృద్ధుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎమ్మెల్యే చంటి నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండల కేంద్రంలోని 7వ నెంబరులో షాపులో ఏపీ ట్రైకార్ చైర్మన్ పేదలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలపతిరావు,డీటీ పి.రమేశ్, సీఎస్ఆర్ఐ కె.పద్మ, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, గద్దె అబ్బులు, కుందుల శ్రీను, మనెల్లి బాలు, మందపాటి మోజేష్, మణికల శ్రీను పాల్గొన్నారు.

● ఉంగుటూరు : చేబ్రోలులో జేసీ ధాత్రి రెడ్డి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రేషన్ దుకాణాన్ని పునఃప్రారంభించారు. వృద్ధులకు, వికలాంగులకు రేషన్‌ను వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత, తహసీల్దార్ పాలపర్తి రవి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త సూరత్తుల అయ్యప్ప, జనసేన పార్టీ మండలాధ్యక్షులు పంది రాంబాబు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలక్టర్ ధాత్రి రెడ్డి డంపింగ్ యార్డును, ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి పరిశీలించారు.

● పెదవేగి : దుగ్గిరాలలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సరుకుల పంపిణీని ప్రారంభించి వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, పెదవేగి తహసీల్దారు ఎస్.డి. భ్రమరాంబ, ఎంపీడీవో పి.శ్రీనివాస్, దుగ్గిరాల సర్పంచ్ గుంజా క్రీస్తుమణి మధుబాబు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు డిపోల ద్వారా రేషన్‌సరుకుల పంపిణీని ప్రారంభించారు.

● పెదపాడు : పెదపాడు మండలం కలపర్రులో రేషన్‌డిపోను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం ప్రారంభించి, కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, గుత్తా అనిల్, మోరు శ్రావణి, మరడాని రవి, నూకల నాగేశ్వరరావు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన రేషన్‌షాపు వద్ద తహసీల్దార్ చల్లన్నదొర రేషన్ సరుకులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, గొలిశెట్టి శ్రీను, ముప్పిడి చినబాబు, సత్తిరాజు, సంకు మధు, శ్రీను, వీఆర్వో వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల, తిమ్మాపురం, దొరసానిపాడు, రాజుపాలెం, తిరుమలంపాలెం, తదితర గ్రామాల్లో రేషన్ దుకాణాలను నేతలు ప్రారంభించారు. టీడీపీ నేత పోలిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొయ్యల మూడి సరిత సర్పంచ్ రజని, డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు వి.నరసింహరావు, వీఆర్వో శ్రీను పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి :స్థానిక కాపుల బజారులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు.నాయకులు గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి ఉన్నారు.

● పోలవరం : స్థానిక బెస్తావీధి రేషన్ షాపు వద్ద ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సరుకుల పంపిణీని ప్రారంభించారు. తహసీల్దారు సాయిరాజు, డిప్యూటీ తహసీల్దారు కంభంపాటి శ్రీనివాసరావు, వీఆర్వోలు గాంధీ, వినయ్, టీడీపీ మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, జనసేన మండలాధ్యక్షులు గునపర్తి చిన్ని, జనసేన సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, నీటిసంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, బీజేపీ నాయకులు బొరగం వెంకటలక్ష్మి, వల్లభనేని మంగతాయారు, ఎస్సీ సెల్ అధ్యక్షులు పిల్లి నాగరాజు, మంగిన కొండ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: వెలగపాడు పంచాయతీలో రేషన్ షాపును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సాయిబాబా, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, తోట లక్ష్మీనారాయణ, జోనుబోయిన సొంబాబు, అద్దంకి జగ్గారావు, కొనకళ్ల మోహన్ కుమార్, నవీన్, అలుమోలు శ్రీనివాసరావు, పెద్దిన సురేశ్, సందేపూడి సాయి, దేవరపల్లి రంగారావు, బండి శ్రీను, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : స్థానిక 3వ నెంబర్ రేషన్‌షాపును ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌లు ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పిచ్చుకరాజు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు యుగంధర్, వెంకన్నబాబు, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

● నిడమర్రు: భువనపల్లిలో రేషన్ షాపును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయకుమారి, డీటీ జరీనాబేగం క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు, నిమ్మల దొరబాబు, అల్లుమోలు అరుణ్‌కుమార్, సంకు నాగేషు, సంకు కొండలరావు నాయుడు పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి తేనీరు స్వీకరించారు. ఎనికేపల్లిలో బీజేపీ ఉంగుటూరు నియోజకర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి పాల్గొని రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సర్పంచ్ పుప్పాల మెహర్ కుమార్, ఎంపీటీసీ నిమ్మల దొరబాబు,ఇంటి ఉదయభాస్కర్, అచ్యుత్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం:రేషన్ షాపుల్లో తహసీల్దార్ ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో రేషన్ సరుకులు పంపిణీ చేశారు. మోరంపూడి మల్లికార్జునరావు, బొంతు రాంబాబు, బొంతు శ్రీను, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 25వ వార్డులోని 37వ రేషన్ దుకాణం, చక్రదేవరపల్లి రేషన్ దుకాణం వద్ద కార్డుదారులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దారు కె.స్లీవజోజి, టీడీపీ నాయకులు రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిశోర్, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, తూటిగుంట రాము, షేక్ యాకూబ్, మారిశెట్టి బాలచిట్టెమ్మ, ఊదర సుబ్బారావు, మానికల సూరిబాబు, బి.అనిల్ పాల్గొన్నారు.

●చింతలపూడి: నగర పంచాయతీలో పాతబస్టాండ్ సమీపంలోని రేషన్ డిపోలో బియ్యాన్ని కూటమి నాయకుడు కొత్తపూడి శేషగిరిరావు పంపిణీ చేశారు. పట్టాయిగూడెంలో సూరానేని గోపి, తిమ్మిరెడ్డిపల్లిలో సి.హెచ్.మోహన్‌రావు, ప్రగడవరంలో టి.చంద్రశేఖర్ రెడ్డి, కె.రాజారెడ్డి, యర్రగుంటపల్లిలో మాజీ జడ్పీటీసీ రాధారాణి, రాఘవాపురంలో మాటూరి వెంకట్రామయ్య పంపిణీ చేశారు. అనీల్, గోపాలరావు, వి.వెంకటేశ్వరరావు, టి.అప్పారావు, అట్లూరి శ్రీనివాసరావు, భారతి పాల్గొన్నారు.


సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి


కొయ్యలగూడెంలో సరుకుల పంపిణీ దృశ్యం


వృద్ధురాలికి రేషన్ అందజేస్తున్న చింతమనేని

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా ఆదివారం జరిగిన పరీక్షకు 46మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 29మంది హాజరయ్యారని ఆర్ఐవో యోహాన్ తెలిపారు. ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి.

ధర్నాను జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీల అమలుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించేందుకు సీపీఐ నాయకులు సన్నాహాలు ప్రారంభించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

3న చేతివృత్తిదారుల సమావేశం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం ఏపీ చేతి వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు యూనియన్ జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య ఆదివారం తెలిపారు.చేతివృత్తిదారులకు ప్రభుత్వాలచే అందే సంక్షేమ పథకాలు అరకొరగా ఉన్నాయన్నారు. స్ఫూర్తి భవనంలో జరిగే చేతివృత్తిదారుల సమావేశంలో తగు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఏపీ చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు హాజరవుతారని కన్నయ్య తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలు

ఉంగుటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : ఎనిమిది హైస్కూళ్లకు నూతన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం ఉంగుటూరు హైస్కూల్‌కు మద్దా రాజా రవీంద్రకుమార్, నారాయణపురానికి తోట పోతురాజు, రాచూరుకు చిన్ని సురేంద్ర, కాగుపాడుకు పి.వి.వి.ఎం.శ్రీనివాసరావు, నీలాద్రిపురానికి వి.విజయదుర్గ, అక్కుపల్లి గోకవరం పాఠశాలకు చింతమనేని లక్ష్మీ చైతన్య, చినవెల్లమిల్లికి ఎం.శ్రీనివాసరావు, చేబ్రోలు బాలికల హైస్కూల్‌కు కె.వి.డి. మల్లేశ్వరి జాయిన్ అయ్యారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

ఉంగుటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి):భీమడోలు గ్రిడ్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 2నుంచి 7వ తేదీ వరకు ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈ.ఈ. కే.ఎం.అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు గొల్లగూడెం సెక్షన్‌కు సంబంధించిన వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ సరఫరా కోసం రెండు దఫాలుగా విద్యుత్ మార్చి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాత్రి 11 గంటల నుంచి 12 గంటల వరకు ఒక గంట సరఫరా చేయనున్నామన్నారు.

జూద స్థావరాలపై దాడి

లింగపాలెం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భోగోలులో పేక ఆడుతున్నట్టు సమాచారం అందడంతో దాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 2200 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలకు సత్కారం

టి.నర్సాపురం, జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం, తిరుమలదేవిపేట హైస్కూల్ హెచ్‌ఎంలుగా బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులను ఆదివారం యూటీఎఫ్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కేతవరం హైస్కూల్ హెచ్ఎంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పూరేటి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. మండలంలోని తిరుమలదేవిపేట హైస్కూల్లో హెచ్ఎంగా బొర్రంపాలెం హైస్కూల్లో పని చేసిన సి.హెచ్.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. వీరిరువుర్ని మండల యూటీఎఫ్ నాయకులు కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ పాఠశాలభివృద్ధికి కృషి చేస్తామని విద్యార్థుల సంఖ్యతో పాటు నూరుశాతం ఉత్తీర్ణత కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామాంజిబాబు, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


క్వారీ భూముల్లో పచ్చగా ఉన్న వరి

క్వారీ భూముల్లో వినూత్నంగా వరిసాగు

భీమడోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) :అంబర్‌పేట పరిసర ప్రాంత రైతులు వినూత్న పంటల సాగుకు తెరతీశారు. కంకర క్వారీల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. క్వారీల్లో కంకర తీసిన తర్వాత నల్లమట్టితో వరి, కోకో వంటి పంటలను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. ఈ రైతుల్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కైకరం హైస్కూల్లో ఒకచోటకు చేరిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉంగుటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : కైకరం హైస్కూల్లో 1996-97 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.తాము చదివిన అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆటపాటలతో సరదాగా గడిపి ఉపాధ్యాయుల సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. యెలిశెట్టి శ్రీనివాసరావు, శానం హరి, తల్లం ముత్య కుమార్, అగ్గాల మురళి, రెడ్డి నాగు, గుత్తికొండ రంగశ్రీ, ప్రియాంక, ఇనగళ్ళ పార్వతి పాల్గొన్నారు.


పెదపాడులో కథలు చదివి వినిపిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

పెదపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు తొలుత తిలక్ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోరాటం గురించి తెలియజేశారు.

● పెదవేగి: శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ విద్యార్థులకు కథలు వినిపించి, వాటిలో నీతిని బోధించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నత మైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

● ఉంగుటూరు: పెద్దిరెడ్డి శేషవేణి వేణు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు ట్రస్టు చైర్మన్ ముత్తంగి వేణుగోపాల్ ధన్యవాదాలు తెలిపారు. ముగింపును పురస్కరించుకుని హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ సాహో సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు ట్రస్టు తరపున సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత రామాయణాన్ని చదివించారు. అనంతరం విద్యార్థులతో ఖోఖో, టెన్నికాయిట్ ఆటలు ఆడించారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు



ఏలూరు కార్పొరేషన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జేష్టమాసం లోని తొలి ఆదివారం కావడంతో పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు సామూహికంగా ఆదివారం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సూర్యనమస్కార పూజలు జరిపారు. ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి అర్చకుల ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్ధాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు సూర్యారాధనకు సంబంధించిన శ్లోకాలను పఠించి భజనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులతో అర్చనలు జరిపించారు. వారి గోత్రనామాలతో పూజలు జరిపారు. ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

ఇంటి తాళం కోసి చోరీ

ముదినేపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు కోసేసి దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన వడాలి గ్రామంలో జరిగింది. వడాలి గ్రామానికి చెందిన దేవరకొండ సత్యనారాయణ వర ప్రసాద్ ఈ ఏడాది ఏప్రిల్ 8న తన కుటుంబంతో సహా హైదరాబాదు వెళ్ళాడు. సుమారు 50 రోజుల తర్వాత ఆయన ఆదివారం ఉదయం తన ఇంటికి తిరిగి రాగా ఇంటి తలుపులకు వేసిన తాళాలు కోసేసి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్ళిచూడగా ఎల్ఈడీ టీవీని దొంగలు ఎత్తుకు పోయినట్లు గుర్తించారు. దీనిపై ముదినేపల్లి హెడ్‌కానిస్టేబుల్ శంకరరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

కైకలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. ఆదివారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ, గతంలో విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను కమ్మిలి పంపిణీ చేశారు. కూటమి నేతలు పూల రామచంద్రరావు, మంగినేని రామకృష్ణ, పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కెకె బాబు, గంగునేని వరప్రసాద్ పాల్గొన్నారు.

సొసైటీ గొడౌన్లు.. అక్కరకు వచ్చేలా!

(ఐదో పేజీ తరువాయి)

ఇస్తారు. సొసైటీలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి 21 రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటారు. అక్టోబరు 25వ తేదీలోగా గొడౌన్లను అద్దెకు ఇచ్చే అంశంపై వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. అన్ని పూర్తయ్యాక వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (డబ్ల్యుడీఆర్ఏ) ఐదేళ్ల కాలానికి రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలను సొసైటీలకు జారీ చేస్తుంది. డబ్ల్యుడీఆర్ఏ అక్రిడేషన్ పొందడం వల్ల సొసైటీల గొడౌన్లకు గుర్తింపు లభించడంతో పాటు స్టోరేజీ వసతుల మెరుగుపడతాయని భావిస్తున్నారు. తద్వారా సొసైటీలకు ఆదాయం జమ అవుతుందని సహకార అధికారులు భావిస్తున్నారు.

'గొడౌన్ల వినియోగానికి యంత్రాంగం ముందుకు రావడం మంచి పరిణామం. త్వరలో వీటిపై తుది నిర్ణయం తీసుకుంటారు. పూర్తి కాని గొడౌన్లకు నిధులు మంజూరు కావాల్సి ఉంది' అని జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సారథి

నూజివీడు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. జనరద్దీ ప్రాంతాలు, హాస్పిటల్స్‌లో, రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, ఎయిర్ పోర్టుల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు ఇళ్ల నుంచి అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. విదేశాల నుంచి స్వదేశానికి వచ్చిన వారు కొవిడ్ టెస్ట్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మాస్కులు, పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచాలని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ హాస్పిటల్లో కొవిడ్‌ను ఎదుర్కోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, మెరుగైన వైద్యానికి వైద్యపరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కొవిడ్‌ను ఎదుర్కొవడానికి గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలని ఆదేశించారు.







కైకలూరులో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ... కలిదిండిలో తహసీల్దార్ రామకృష్ణ.. గుడిపాడులో రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమణ

అట్టహాసంగా రేషన్ దుకాణాల పునఃప్రారంభం

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ముసునూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రేషన్ దుకాణాలు పండుగ వాతావరణంలో ఆదివారం పునఃప్రారంభమయ్యాయి. రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి డీలర్లు సకల ఏర్పాట్లు చేశారు. దుకాణాల వద్ద మామిడి తోరణాలు, అరటి పిలకలు, పూలమాలలతో అలంకరణ చేశారు. గుడిపాడులో రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ కె.వి రమణ, టీడీపీ నాయకులు సంయుక్తంగా ప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, మండల టీడీపీ అధ్యక్షులు దేవినేని ధలరామ్‌లు, గోపవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, సీనియర్ నాయకులు ఉండవల్లి ధర్మరాజు తదితరులు, చెక్కపల్లిలో సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, లోపూడిలో సర్పంచ్ పేరం కృష్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షులు చలమాల వెంకటేశ్వరరావు రేషన్ దుకాణాలను ప్రారంభించారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, చనుబండ, సూరంపాలెం, కోటపాడు, పర్వతాపురం, పోతనపల్లి, పోలవరం, జనార్ధనవరం తదితర గ్రామాల్లో ఆదివారం ప్రభుత్వ చౌకధరల దుకాణాలను కూటమి నాయకులు, అధికారులు పునఃప్రారంభించారు. తహసీల్దార్ ఈశ్వరరావు, కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, అంబటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వ చౌక ధరల దుకాణాల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమం ఆదివారం ముదినేపల్లి మండలంలో కోలాహలంగా ప్రారంభమైంది. మండలంలోని చౌక డిపోల వద్దకు జనం ఉదయం 8 గంటలకే రావటం ప్రారంభించారు. వడాలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, చిగురుకోట, ముదినేపల్లిలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ రేషన్ పంపిణీని ప్రారంభించారు. గ్రామాల్లో పలువురు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే రేషన్‌ను అందజేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, ఎన్‌డీఏ నాయకులు కోడూరు శేషుబాబు, పోసిన పసాండ రంగారావు, పరసా ఏడుకొండలు పాల్గొన్నారు.

నూజివీడు: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు నూజివీడు మండల తహసీల్దార్ బద్రు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపుల ద్వారా ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రేషన్ షాపుల ద్వారా ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆగిరిపల్లి: రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునఃప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం ఆగిరిపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రారంభించారు. ఆగిరిపల్లిలోని రేషన్ దుకాణాన్ని ఎమ్మార్వో పియాన్స్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ దుకాణాల నుంచే రేషన్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మడుపల్లి గోపాల్, చౌటపల్లి విక్టర్ బాబు, పామర్తి సరసయ్య, దుప్పల సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో 46 రేషన్ షాపులను రెవెన్యూ అధికారులు రేషన్ డీలర్లతో కలసి పునఃప్రారంభించారు. కలిదిండిలో రేషన్ షాపును తహసీల్దార్ రామకృష్ణ కూటమి నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు నున్న సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మండవల్లి: రేషన్ షాపులు ఆదివారం మండవల్లి మండలం వద్ద పునః ప్రారంభమయ్యాయి. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, గుడివాడ చిట్టిబాబు, టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, తహసీల్దార్ గోపాల్ మండవల్లిలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు.

కైకలూరు: పేదల ప్రజలకు జీవనోపాధి దెబ్బతినకుండా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం దుకాణాల వద్దే రేషన్ పంపిణీకి మరలా శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆదివారం కైకలూరు 1వ నెంబరు రేషన్ దుకాణం వద్ద సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, కూటమి నేతలు పీపీఎస్ మాల్యాద్రి, ఎండీ జానీ, కీర్తి వెంకటరాంప్రసాద్, బోడావుల జగదీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నచెరువుగట్టుపై ఉన్న రేషన్‌దుకాణం వద్ద మాజీ ఎమ్మెల్సీ కమ్మిలివిఠలరావు, వైఎస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు ఆధ్వర్యంలో రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

కైకలూరు 1వ నెంబర్ రేషన్ దుకాణంలో ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి వస్తువులు కరెక్ట్‌గా అందుతున్నది లేనిది తెలుసుకున్నారు. అలాగే ప్రతి దుకాణం వద్ద తుచా తప్పకుండా అర్హత కల్గిన ప్రతి లబ్ధిదారుడు రేషన్ సరుకులు తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు పట్టణ, మండల ప్రాంతాలలో రేషన్ దుకాణాలు పునఃప్రారంభమయ్యాయి. వాహనాల ద్వారా రేషన్ ఇంటింటికి పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో రేషన్ దుకాణాల నుంచి లబ్ధిదారులకు నేరుగా రేషన్ పొందే విధంగా చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



లారీపై పడిన విద్యుత్ స్తంభం

తప్పిన పెను ప్రమాదం

కరెంటువైర్లను తాకిన లారీ

కైకలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భక్తులతో రద్దీగా ఉండే ప్రదేశం, ఇరుకురోడ్డులో వ్యాన్‌ను తీసుకువెళ్లి హైటెన్షన్ విద్యుత్ వైర్లకు పట్టించిన సంఘటనలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం కైకలూరు మండలం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయం వెనుకవైపు కోనేరు సమీపంలో వ్యాన్ విద్యుత్ వైర్లను పట్టించి లాగడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున వాహనాల్లో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అలాగే ఐషర్ వ్యాన్‌పై కొంతమంది భక్తులు ఆలయానికి రాగా వారంతా ఆలయ ముఖఃమండపం వద్ద దిగారు. వ్యాన్‌డ్రైవర్ ఆలయం పక్కన ఉన్న నూతనంగా నిర్మాణం చేసిన సిమెంటురోడ్డు వెంబడి ఇరుకు ప్రదేశంలో బలవంతంగా వ్యాన్‌ను తీసుకువెళ్లాడు. కోనేరు సమీపంలో హైటెన్షన్ విద్యుత్‌వైర్లు పట్టివేశాయి. ఆ సమయంలో వ్యానును బలవంతంగా ముందుకు నడపడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం సైతం విరిగిపడింది. డ్రైవర్ అత్యంత నిర్లక్ష్యంగా వ్యాన్‌ను నడపడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం చోటు చేసుకున్న చోట భక్తులతో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో భయంతో వైర్లు తెగిన సమయంలో పరుగులు తీశారు. స్తంభం పూర్తిగా విరిగి వ్యాన్‌పై పడిపోవడంతో దానిని తీయకుండా వదిలివేశారు.

రోడ్లపై రేషన్ పంపిణీకి తెర

మూలకు చేరిన ఎండీయూ వాహనాలు
వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకే రేషన్



ముదినేపల్లిలో మూలకు చేరిన ఎండియూ వాహనం

ముదినేపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ విధానం అమలులోకి రావటంతో ఇక ముందు రోడ్లపై రేషన్ పంపిణీకి తెర పడింది. ఐదు సంవత్సరాలుగా ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాల ద్వారా నిర్వహించిన పంపిణీ వ్యవస్థ ముగిసింది. దీంతో ఎండీయూ వాహనాలు మూలకు చేరాయి. ఇంటింటికీ రేషన్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నెలకొన్న లోటుపాట్లు, అవకతవకలను గుర్తించిన ప్రభుత్వం చౌక ధరల దుకాణాల వద్దే ఆదివారం నుంచి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించింది. దీంతో ముదినేపల్లి మండలంలోని 12 ఎండీయూ వాహనాలు ఆపరేటర్ల ఇళ్ల వద్దే ఉండి పోయాయి. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ అనే నినాదంతో ఈ ఎండీయూ వాహనాల వ్యవస్థను ప్రవేశపెట్టినా గ్రామాల్లో ఆ వాహనాలు వీధి, చివరినో, కూడలి ప్రదేశాల్లోనే ఉండేవి తప్ప ఇళ్ల వద్దకు వచ్చేవి కావు. దీంతో రోడ్లపైనే జనం బారులు తీరి రేషన్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ వాహనాలు గ్రామాల్లో ఏ బజారుకు ఎప్పుడొస్తుందో తెలియక కొంతమంది కూలి పనులు మానుకుని కూడ రేషన్ కోసం ఇళ్ల వద్దే వేచి ఉండేవారు. ఇప్పుడు ఆ అవస్థలు తప్పాయి. వినియోగదారులు తమ వెసులుబాటు సమయాల్లో ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చు. అప్పట్లో వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు కూడ ఎండీయూ వాహనాల వద్దకు రేషన్ కోసం వచ్చేవారు. ఇప్పుడు వారికి ప్రభుత్వం ఇళ్ల వద్దకే రేషన్ పంపిస్తుండటంతో వారు చౌక డిపోల వద్దకు రావాల్సిన అవసరం లేకుండాపోయింది.







పెదలంకలో 2005 - 06 బ్యాచ్ విద్యార్థులు... భాస్కరావుపేటలో 1996-97 పూర్వ విద్యార్థులు... మండవల్లిలో 2004-05 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలిదిండి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక జడ్పీ హైస్కూల్‌లో 2005-06లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దున్న శ్రీనివాసరావు, ముద్దం నరేష్, పెన్మెత్స సురేందర్ రాజు, పోకల శ్రీనివాసరావు, చాబత్తిన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్ 1996-97 లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో, వ్యాపార, వాణిజ్య రంగాల్లో స్థిరపడిన వారంతా కలసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సహపంక్తి భోజనం చేశారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈకార్యక్రమంలో ముద్దం రంగబాబు, రెడ్డి అప్పారావు, అలుగుల రాజు, పెద్దింటి హరికృష్ణ, అల్లు శేఖర్, చెల్లంకి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 20ఏళ్ళ తర్వాత అంతా కలుసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగారు. తమ కుటుంబ నేపథ్యాలను, కష్ట సుఖాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులలో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులలో ఉన్న మిత్రులకు సహాయసహకారాలను అందించాలని తీర్మానించారు.



నేటి నుంచి శ్రీ కృష్ణుడి ఆలయ ప్రతిష్ఠ పూజలు

ముసునూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణుడి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు నండూరి మధుసూధన్, పాకనాటి రాజారావు, తలకొండ భాస్కరరావు, కందుల పిచ్చియ్య తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఉదయం 8.01 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర, కలశ, ద్వారపాలక, బొడ్డురాయి స్థాపనలు జరుగుతాయని తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ రోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

చేవూరులో అన్నసమారాధన



లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అన్నదాన పూజలు

ముదినేపల్లి, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరు లోని శ్రీ లక్ష్మీనారా యణ స్వామి కల్యాణోత్సవాల ముగింపు సంద ర్భంగా ఆదివారం దేవస్థానంలో అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మంది పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కలిదిండి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్‌బాబు, రాఘవులు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నేర్పించారు.

అహల్యా బాయికి నివాళులు

ముదినేపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దార్శనికురాలు అహల్యా బాయి హోల్కర్ జయంతి ఉత్సవాన్ని ఆదివారం ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకురాలు రెడ్డి రాధిక, సోమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గులిపల్లి సుధారాణి, నాయకులు పత్తి శ్రీనివాసరావు, యాదాల శివాని, గునిశెట్టి గౌరి తదితరులు అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

రోహిణి కార్తె ప్రభావం

ఎండ, వడగాల్పులకు జనం విలవిల



నిర్మానుష్యంగా ఉన్న చాట్రాయి సెంటర్

చాట్రాయి, జూన్ 1(ఆంధ్ర జ్యోతి): రోహిణి కార్తె ప్రతాపంతో ఆదివారం తీవ్రమైన ఎండలు వడ గాల్పులకు జనం విలవిలలాడారు. ఉద యం 7 గంటల నుంచి ఎండ వడగాల్పులు మొదలై మధ్యాహ్నానికి తీవ్ర స్థాయికి చేరి సాయంత్రం వరకు తగ్గలేదు. ఎండలు వడగాల్పులకు భయపడి జనం ఇళ్లకే పరిమితం కావటంతో వీధులన్నీ నిర్మానుష్యంగా కన్పించాయి. వృద్ధులు, గర్భి ణులు చిన్న పిల్లలు ఎండ వడగాల్పులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మే 25న రోహిణి కార్తె వచ్చినప్పటికి రోజు ఏదో సమయంలో వర్షం పడుతుండటంతో ప్రభావం పెద్దగా కన్పించలేదు. వాతావరణం చల్లబడిందిలే అనుకుంటుండగా హఠాత్తుగా ఎండలు వడగాల్పులు రావటంతో జనం ఉక్కిబిక్కిరి అయ్యారు. ఈ ఎండలు వడగాల్పులు ఎన్ని రోజులు ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

హెచ్‌ఎంలు బాధ్యతల స్వీకరణ

చాట్రాయి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో మూడు హైస్కూల్స్‌లో కొత్తగా నియమితులైన హెచ్‌ఎంలు బాధ్యతలు చేపట్టారు. మూడు హైస్కూల్స్‌లో శనివారం హెచ్‌ఎంలు బాధ్యలు చేపట్టిన విషయం విధితమే. సి గుడిపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎ. బక్కయ్య, చిన్నంపేట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎ.లక్ష్మి, చిత్తపూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా జి.సౌభాగ్యం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. హెచ్‌ఎంలు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు.

ముదినేపల్లి: అప్పర్ ప్రైమరీ స్కూలు నుంచి అప్‌గ్రేడ్ అయిన ముదినేపల్లి మండలం సింగరాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు తొలి ప్రధానోపాధ్యాయురాలిగా జె.మాధవీలత ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మండవల్లి మండలం పెనుమాకలంకలో అప్పర్ ప్రైమరీలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమె ప్రమోషన్‌పై సింగరాయపాలెం హెచ్‌ఎంగా నియమితులయ్యారు.

భ్రమరాంబ దేవికి ప్రత్యేక పూజలు

మండవల్లి జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం వైభవంగా మల్లేశ్వర స్వామికి సహస్ర బిల్వార్చన పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలతో లలితా సహస్రనామార్చన పూజ, 9 సార్లు మణిద్వీప వర్ణన పారాయణం చేశారు.


పెద్దింట్లమ్మకు మామిడికాయల మొక్కుబడులు



అమ్మవారికి మామిడికాయలను మొక్కుబడిగా చెల్లించుకుంటున్న భక్తులు

కైకలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారికి వందలాది మామిడి పండ్లు నైవేద్యంగా సమర్పించి భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం ఏలూరు, పశ్చిమ గోదారి, కృష్ణాజిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాన్ని సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులు వందలాది మామిడిపండ్లు అమ్మవారికి, ఆలయ ధ్వజ స్తంభం వద్ద రాసులుగా పోసి మొక్కుబడి చెల్లించుకుని విశేషపూజలను నిర్వహించారు. ఎండ వేడిని లెక్కచేయకుండా భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఉచితంగా మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో యోగా చేస్తున్న ఏఎస్సై, సిబ్బంది

ముసునూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగాను నిత్యం సాధన చేస్తే ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతాయని ఏఎస్ఐ నాగభూషణరావు అన్నారు. యోగాంధ్రలో భాగాంగా ఆదివారం ముసునూరు పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మారుతున్న కాలంలో ఉరుకుల పరుగుల జీవితాలలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతూ అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. నిత్యం యోగాను సాధన చేస్తే శక్తి, ఏకాగ్రత పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆగిరిపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ రిపేర్ల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నూజివీడు ఏడీ పోతురాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కైకలూరు: కైకలూరులోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు కైకలూరు శ్యామలాంబ అమ్మవారి టౌన్ ఫీడర్‌లో విద్యుత్‌లైన్లకు అనుకున్న చెట్లను తొలగించడం, లైన్ల మరమ్మతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందువలన కైకలూరులోని ఏలూరురోడ్డు, మెయిన్‌రోడ్డు, వారపుసంత, కలిదిండి రోడ్డు, రాజీవ్‌జలాశయం ప్రాంతాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేలబావి పూడ్చివేత పనులు



ముసునూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ముసునూ రు గ్రామ పంచాయతీలో దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించడమే లక్ష్యమని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. ఎస్సీకాలనీలో జనవాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న మరో నేలబావిని పూడ్చివేసేందుకు సర్పంచ్ చర్యలు చేపట్టారు. సూమారు రూ.75వేలతో 150 ట్రిప్పులు మట్టిని తరలించి నేలబావిని పూర్తిస్థాయిలో పూడ్చివేశారు. రెండు రోజుల క్రితం అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఒక బావిని రూ.లక్ష వ్యయంతో 200 ట్రిపుల మట్టితో పూడ్చి వేశారు. ఈ పనులను సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దివాకర్ తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు కావాలి

నూజివీడు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి క్రీడల్లో భాగస్వామిగా ఉండాలని నూజివీడు డీవైఈవో సేవియా నాయక్ సూచించారు. నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ వద్ద సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు క్రీడల్లో ప్రతిరోజు తర్ఫీదు పొందేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు.